1987 దీపావళి మినీ కథల పోటీకి రు.75 బహుమతి పొందిన రచన



# తల్లిమనసు

యం.వి.లత

తట్టి లేపినట్లే మెలకువ వచ్చింది. లేచి కూర్చున్నా. టైము చూస్తే మూడయ్యింది. నవల చదువుతూ నిద్రపోయానన్నమాట.

తలుపులు టకటక కొట్టిన శబ్దం. నిజమే ఎవరో తలుపు కొడితేనే నాకు మెలకువ వచ్చిందని గ్రహించి లేచి వెళ్ళి తలుపు తీశాను. ఎదురుగా జక్కమ్మ. నా బంగారం లాంటి నిద్ర చెడగొట్టినందుకు చిరాకేసింది. మౌనంగా వెళ్ళి సోఫాలో కూర్చున్నా. నా వెనకే వచ్చి నా ఎదురుగా చతికిలబడింది. అదే సంగతి చెప్తుందిలే అని నేనేమీ పలుకరించలేదు. అరవైయ్యేళ్ళ ముదుసలి. వడలి పోయిన నందివర్ధనంలా వుంటుంది. చింపిరి జుట్టు, పీలి కల చీరని అతుకులు పోసి కట్టుకుంది. రేపో మాపో రాలిపోయేలా వుంది. దాని ముఖంలో రావి ఆకులోని గీతల్లా వున్నాయి ముడతలు. అదెంతకీ మాటాడక బుర్రొంచుకుని కూర్చుంటే - "ఏమిటి జక్కమ్మా!" అన్నా — కళ్ళెత్తి చూసింది.

చెరువులు! ఒణుకుతున్న పెదాలలోంచి 'అమ్మా' అంటూ బావురుమంది. నేను గాభరాపడిపోయాను.

"ఏందుకూ? ఏవిటీ? ఏమైందమ్మా? ఛ...ఛ... వూరుకో ఏమైందో చెప్పు?" అన్నా.

కెల్లానా? యాభై రూపాయిలు — బియ్యం వత్తే కొను క్కోవాలని. అందుకే బేగెల్లిపోయాను గూడా. కొని చెక్క పెట్టిలో పోసుకున్నానమ్మా. పైన అట్టముక్క మూత బెట్టినా. నా గుడిశకి తలుపు లేదు తల్లా. ఈ తాకుల సాప అడ్డం పెట్టినా. నా గుడిశనంటుకునే నా కొడుకు గుడిశ. నా కోడలు మంచంలో తొంగొనే వుంది. మాయదారి ఎద్దు నా సాప పడేసి గుడిశలో దూరి నా బియ్యమన్నీ బొక్కి కిందదేసి ఆగం ఆగం సేసే శాయి తల్లీ. ఈడ పనిజేసుకుని ఇంటికెల్లే తలికి బియ్యం బొక్కుతున్నాయి. బయట నా మనవరాలు అరుత్తానే వుంది. ఆ కోడలు లెగనే లేదు. నా గుండెలు జారిపోయినై అమ్మా. నెలంతా నా కడుపుకి గంజి ఆ బియ్యమేనమ్మా. రెక్కలు ముక్కలు సేసుకుని ఈ వయసులో కడుపు కింత సంపాయిత్తన్నా. పగులు నీవు పెట్టే పట్టెడన్నం తిని, రాత్రేల గంజిగాసుకుని, నువ్విచ్చిన పచ్చడో, కూరో పెట్టుకుని పూట గడుపు కుంతన్నా. కొడుకైనందుకు ఆడు నన్ను సూడడు. మిరిచ్చే మెతుకులు కేరేజీలో అట్టుకుని ఆల్లకి పెట్టడం లేదని నా కోడలు బండబూతులు తిట్టె. ఆడికీ ఆల్లీలు ఇచ్చే ఫలారం శపాతీ, ఉప్మాగాసింది పొట్లం గట్టుకెల్లి ఆ పిలకాయలకే బెడతావుంటిని. మొన్నటికి మొన్న దానికి జొరం వత్తే మీ కాడ్నే బిళ్ళలిప్పిచ్చుకుని, ఇందిరమ్మ దగ్గర అడ్మాన్సు ఇప్పించుకుని దానికే ఇచ్చా. ఆల్లీల్లు ఇచ్చిన సీరెలన్నీ అదే కొట్టేత్తది. నీ బిడ్డ గౌన్లు, సొక్కలు నా మనవరాలికి అట్టుకెల్లానా. ఇంకేం సేయునమ్మా. ఊరు పొమ్మంటాంది కాడె రమ్మంటాంది. ఏ ఛనంలో సత్తానో తలకొరివి బెడతాడుగదాని పక్కనే గుడిసేసు కున్నా. కూత్తి లేసి గొడ్డని తోలగూడదా? అన్నా కోడల్ని. అది గయ్యుమని లేసె. ఆడూ గయ్యిమనే. మొగుడ్ని ఇంకా రెచ్చగొడతాది. ఆడు ఒంటికాలిమీద వచ్చి నా జుట్టు పట్టి పీకి, నా గుడిశ పీకేసి నాడమ్మా!" దాని కంఠం రుద్దమై దుఃఖంతో పూడుకుపోయింది.

ఇలా నా దగ్గర ఇది ఏడవడం అరవై ఒకటోసారి. దీనికి బుద్ధిలేదు. సిగ్గులేదు. ఛలికి ఒణ ఒణ ఒణుకు తుంటే ముసలిది, పేదది అని ఓ పాత దుప్పటి ఇచ్చా డిసెంబరులో. రెండో రోజు "ఆడు కట్టం సేసొచ్చి రాత్రేల సలికి ఒనుకుతా ముడుసుకు పోతుంటే సూళ్ళేక మిరిచ్చిన దుప్పటి కప్పానమ్మా. ఇప్పుడు నా కొడుకే దాన్ని కప్పుకుంటాండు" అంది. నా క్కోపమొచ్చినా ఏమనలేదు. వేసవి కాలంలో కాళ్ళంటుకుపోతున్నా యంటే నా చెప్పులిచ్చేశా. ఫేషనుగా, అందంగా వున్నా యని ఆ చెప్పులు కోడలు తీసేసుకుందంట. జాకెట్లు చీరలు ఏమిచ్చినా అంతే. పది, పదిహేను రోజులకి ఇలాగే వచ్చి చెప్పుకుని ఏడుస్తుంది. మొదట్లో బాగా స్పందించి, బాధపడేదాన్ని. క్రమేపీ గ్రహించాను. దాని కష్టాలు నేనాపలేను అని. మనస్సు గట్టిపడుతున్న సమ యంలో — రాత్రి చదివిన "మదర్ థెరిసా చరిత్ర" జ్ఞాపకం వచ్చింది. 'ఆమె నా స్థలంలో వుంటే ఏమి చేసేది? ఈ జక్కమ్మని ఆలింగనం చేసుకుని, దయతో కన్నీరు తుడిచి, చేయందించి......'

కుర్చీలోంచి లేచాను.

ఐదు కేజీల బియ్యం సంచిలో పోసిచ్చాను.

పచ్చళ్ళు పెట్టిచ్చాను.

ఇరవై రూపాయిలు చేతిలో పెట్టాను.

ఓ పాతచీర తీసిచ్చాను.

తలకి నూనె ఇచ్చాను.

వేడి వేడి టీ తాగి, అవన్నీ తీసుకుని మనసారా దీవిస్తూ వెళ్ళిపోయింది.

రెండ్రోజుల తర్వాత దానికి జ్వరం వచ్చి, దాని బదులుగా దాని కోడలు వచ్చింది. మొన్న నేనిచ్చిన చీరె కట్టుకొనుంది.

"నువ్విచ్చినయి నాల్రూపాయల బియ్యం గదమ్మా. కొడుక్కి ఒండి పెట్టమని నా తాన రెండ్రూపాయిల బియ్యం తీస్కుంది. నా పెద్ద బిడ్డ ఇస్కూలు కెల్తాంది. దానికేమ్యో బొక్కులు లేవంటే, నువ్విచ్చిన డబ్బులే ఎట్టి కొన్నాది. ఇప్పుడేమో పైసల్లేవు. డాటారు దగ్గరకు తీస్కెల్లాలి..." ఇంకా ఏమేమో అంటోంది గానీ నేను వచ్చేశా.

'ఏ బాంధవ్యమూ లేని మదర్ థెరిసాయే అంత సేవ చేస్తున్నప్పుడు "తల్లి మనసు" తనవారి కష్టాలను చూసి సహించగలదా?' నా ఆత్మ ప్రశ్నిస్తోంది.